క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

సుబ్రమణ్యంకు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రం



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకుడు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యంకు అమెరికాలోని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు ఆన్‌లైన్‌లో ప్రశంసా పత్రాన్ని పంపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. దీనిపై స్పందించిన క్లబ్ చైర్‌పర్సన్ డాక్టర్ పట్టిహిల్ ప్రశంసా పత్రాన్ని పంపినట్లు చెప్పారు.

కల్యాణం.. కమనీయం



మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. నవులూరు గోలివారితోట, కాజ అగస్త్యేశ్వర స్వామి ఆలయం, యర్రబాలెం శివాలయం పాత మంగళగిరి కనకదుర్గ ఆలయాల్లో కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యి.. తిలకించారు. స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయాల వద్ద కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్మికులకు న్యాయం చేయండి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ గురువారం సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే సిమెంట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నా కార్మికులకు బకాయిలు మాత్రం యాజమాన్యం చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా మంత్రి నారాలోకేష్ ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యహోషువా, మాణిక్యరావు, బాషా, అగ్గయ్య, దానయ్య, శివకుమారి, సారమ్మ, రిబ్కా పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులపై అధికారుల స్పందన

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన విద్యార్థులా.. లేక కూలీలా శీర్షిక కథనానికి అధికారులు స్పందించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గంలో విద్యార్థులతో పనులు చేయించడంపై జిల్లా విద్యాశాఖాదికారి సీవీ రేణుక, తెనాలి ఉప విద్యాశాఖాదికారి గురువారం ప్రధానోపాధ్యాయులు ద్వారా నివేదిక తెప్పించుకున్నారు. నివేదిక ప్రకారం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గదుల్లో కుర్చీలు సిబ్బంది ద్వారా సర్దించడం జరిగిందని, వారికి సహాయంగా కొందరు విద్యార్థులు కుర్చీలు, బెంచీలు పట్టడం జరిగిందన్నారు.

నేడు భారీ అన్న సంతర్పణ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి పోలకంపాడులో వేంచేసి యున్న పోలకమ్మతల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు వంగ దేవ గురువారం తెలిపారు. పోలకంపాడులోని పోలకమ్మ తల్లిదేవాలయ 17వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి 11 గంటల వరకు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంత ప్రభాకర్, తోక సత్యనారాయణ, గంగాధర్, కొండలరావు, బత్తుల నాగబాబు, బత్తుల ప్రభుదాసు, వంగ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన పట్టభద్రులు

- తెనాలిలో ప్రశాంతంగా పోలింగ్
- డివిజన్‌లో 70.09 శాతం, తెనాలిలో 68.91 శాతం నమోదు
- తెనాలిలో ఓటు వేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, నాదెండ్ల



కేఎస్ఎం హైస్కూలు పోలింగ్ కేంద్రంలో క్యూలైనులో ఓటర్లు

తెనాలి: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటల నుంచి ఆరంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. తెనాలి డివిజన్‌లో 19,677 మంది పురుషులు, 13,485 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఓటు వేశారు. డివిజన్ వ్యాప్తంగా 33,169 మంది ఓటు వేయగా, 70.09 శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు ప్రకటించారు. తెనాలి నియోజకవర్గం విషయానికొస్తే, పట్టణంలోని 26 పోలింగ్ కేంద్రాలు, కొల్లిపర మండలంలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 68.91 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో పురుష ఓటర్లు 13,341 మందికిగాను 9,406 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 10,014 మంది మహిళా ఓటర్లకు గాను 6,690 మంది ఓటు వేశారు. మూడు ట్రాన్స్‌జెండర్ ఓట్లకుగాను ఒక్కరూ ఓటు వేయలేదు. నియోజకవర్గంలో మొత్తం 23,358 ఓట్లకుగాను 16,096 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు, షామియానాలు, హెల్ప్ డెస్క్, హెల్త్ డెస్క్‌లు అన్నిచోట్లా కనిపించాయి. అయితే పోలింగ్ మాత్రం మందకొడిగా ప్రారంభమైంది. తొలి రెండు గంటల్లో కేవలం 20 శాతం మాత్రమే ఓటింగ్ జరిగిందని అంచనా. డివిజన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు 32.01 శాతం ఓటింగ్ జరగ్గా, మధ్యాహ్నం రెండు గంటలకు 51.50 శాతం, పోలింగ్ సమయం ముగిసే సమయానికి 70.08 శాతం ఓటింగ్ జరిగింది.

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సొంత నియోజకవర్గమైన తెనాలిలో ఆ పార్టీ కార్యకర్తలు ప్రతి పోలింగ్ కేంద్రం వద్దే ఉండి గ్రాడ్యుయేట్ ఓట్లు గరిష్టంగా పోలయ్యేలా చూశారు. హైదరాబాద్ వంటి దూరప్రాంతాల్లో ఉంటున్న వారిని ప్రత్యేకంగా బస్సులు పంపి రప్పించుకున్నారు. మధ్యాహ్నం అందరికీ భోజన సదుపాయం కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థులందరికీ ఏజెంట్లు లేరు. చాలా కేంద్రాల్లో ఇద్దరు లేదా ముగ్గురు ఏజెంట్లు మాత్రమే కనిపించారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిని గుర్తింపు కార్డు అడిగిన వారు కనిపించలేదు. ఓటరు కరెక్టేనా అని పోలింగ్ సిబ్బంది అడిగటం, కరెక్టేనని ఏజెంటు ఒకరు బదులిస్తే ఓటు ఇస్తున్నారు. ఈ క్రమంలో పలుచోట్ల దొంగ ఓట్లు పోలైనట్టు ఆరోపణలున్నాయి. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో ఒక యువకుడు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి రాగా, అతడి ఓటు అప్పటికే పోలైనట్టు చెప్పటంతో ఖిన్నుడై వెళ్లిపోయాడు. కూటమి అభ్యర్థితో పోల్చుకుంటే పీడీఎఫ్ అభ్యర్థి క్యాడర్ పోలింగ్ కేంద్రాల వద్ద దాదాపు కనిపించలేదు.



ఉర్దూ పాఠశాల వద్ద సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ



కేఎస్ఎం స్కూలులో సహాయ ఎన్నికల అధికారి బండి శేషన్న



తెనాలి మున్సిపల్ బాలుర హైస్కూలులో బారులు తీరిన ఓటర్లు

తెనాలికి చెందిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూలులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను చెప్పేందుకే తాను బిజీ షెడ్యూలులో కూడా ఓటు వేసేందుకు వచ్చినట్టు చెప్పారు. తెనాలికే చెందిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ప్రతి ఇంటికీ మేలు చేయాలని, విద్యార్థులకు ఉపాధి శిక్షణ, పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగాలను కల్పించాలని చూస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మనోహర్ ఈ సందర్భంగా అన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అయితానగర్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొల్లిపరలో 73.2 శాతం పోలింగ్



కొల్లిపరలో బారులు తీరిన ఓటర్లు

కొల్లిపర: కొల్లిపర మండలంలోని 20 గ్రామా ల్లో 2,581 మంది పట్టభద్రులు ఉండగా 1,889 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు తహసీల్దార్ జి.సిద్ధార్థ, మండల ఎన్నికల పర్యవేక్షణ అధికారి విజయబాబు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియను ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ పర్యవేక్షించారు. ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.



ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కేఎస్ఎం స్కూలులో వీల్‌చైర్‌లో ఓటు వేసి వస్తున్న వృద్ధుడు



వీల్‌చైర్‌లో ఓటు వేసేందుకు వెళుతున్న మహిళ



హెల్ప్ డెస్క్‌లో సమాచారం తెలుసుకుంటున్న యువతులు



మహిళను ఓటు వేసేందుకు తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు

అందరికీ మహాశివుని ఆశీస్సులు ఉండాలి

మాజీ ఎంపీపీ వెనిగళ్ళ కృష్ణప్రసాద్



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ కృష్ణప్రసాద్

తెనాలిటౌన్: మహాశివరాత్రి పర్వదినాన పరమశివుని ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ళ కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. రూరల్ మండలం ఖాజీపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా వెనిగళ్ళ కృష్ణప్రసాద్ పాల్గొని పేద వృద్ధులకు కొత్త వస్త్రాలు అందజేశారు. విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. దేవాలయాభివృద్ధికి ధర్మకర్త రాచర్ల సాంబయ్య చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. వసుదైక కుటుంబం ఖాజీపేట వారిచే నిర్వహించిన కోలాట ప్రదర్శన, జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రేమిణిశెట్టి దుర్గాప్రసాద్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు కొండకావూరి నాగలింగశర్మ, రాచర్ల వెంకటసత్యనారాయణ, శనగపల్లి వెంకటేశ్వరరావు, తాళ్ళ సీతారామిరెడ్డి, పాతూరి నాగేశ్వరరావు, రెడ్డి శివరామకృష్ణ, అంకిరెడ్డి సీతారామయ్య, పోతాబత్తుని మోహనరావు, కాలిశెట్టి గాయత్రీదేవి, పసుపులేటి వెంకట్రావు పాల్గొన్నారు.

అభియోగాలు లేకుండా ఉద్యోగ విరమణ అదృష్టం


సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



ఆషా, నాగశంకర్ దంపతులను సత్కరిస్తున్న నరసింహారెడ్డి తదితరులు

లక్ష్మీపురం: ప్రభుత్వ ఉద్యోగులు తప్పులు, అభియోగాలు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావించాలని సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో సూపరింటెండెంట్ పోగుల ఆషా ఉద్యోగ విరమణ సభ గురువారం నిర్వహించారు. కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలిసో తెలియక చేసిన తప్పులు వల్ల పలు శాఖల్లోని ఉద్యోగులు విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవి పరిష్కారం అయ్యేసరికి పదవీ కాలం కూడా ముగుస్తుందన్నారు. కొన్ని కేసులు రిటైర్మెంట్ తర్వాత కూడా వేధిస్తాయని, పెన్షన్ లో కూడా ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ఉద్యోగులందరూ విధినిర్వహణలో ఎలాంటి అభియోగాలు, అభ్యంతరాలు, ఆరోపణలు, లోపాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పదవీ విరమణ చేస్తున్న ఆషా తన సర్వీసులో ఎటువంటి మచ్చ లేకుండా, పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేశారని కమిషనర్ కొనియాడారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆషా ఎన్నోసార్లు రక్తదానం చేశారని, అవయవ దానం చేయడానికి కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఆషా, నాగశంకర్ దంపతులను కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆయన సతీమణి, కేంద్ర ప్రభుత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సాధు కావ్య, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు వి.వి.రావు, నాగరాజు, రవికుమార్, మనోజ్ కుమార్, రాయలు, సీతారామరాజు సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చీదెళ్ల ఈశ్వరరావు, చిట్టే వెంకట్, పెన్షనర్ల సంఘ నాయకులు రాజేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి, నిరుద్యోగుల ఆశలు వమ్ము కానీయకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగుల జీవితాలను బాగు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైన ఆలోచన, ప్రణాళికతో 11 అంశాలను మేనిఫెస్టోలో చేర్చానని చెప్పారు. గురువారం జరిగిన ఎన్నికల్లో తనకు ఓటు వేసిన గ్రాడ్యుయేట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

గుంటూరు రూరల్: మండలంలోని తోకవారిపాలెంలో బుధవారం అనుమానాస్పదస్థితిలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోపూరి శ్రీనివాసరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ గురువారం శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

శివయ్యకు బ్రహ్మ 'రథం'

తెనాలి: మహాశివరాత్రి పర్వదినాన్ని పట్టణ, పరిసరాల్లోని ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. శైవాలయాల్లో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక గంగానమ్మపేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాల అభిషేకాలను నిర్వహించారు. ఆ తర్వాత 12.15 గంటలకు శ్రీస్వామి–అమ్మవార్ల ఎదురుకోల ఉత్సవాన్ని భక్తజనుల సమక్షంలో జరిపించారు. తదుపరి 1.35 గంటలకు శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించగా, వేలాది మంది భక్తులు వీక్షించారు. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 9.45 గంటలకు నిత్యపూజ, హోమ విధులు, గ్రామ బలిహరణ అనంతరం నంది వాహన సేవలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మాదల వెంకటేశ్వర్లు–వాసవి దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామివార్ల దివ్య రథోత్సవం ఆలయం నుంచి బయలుదేరింది. భారీసంఖ్యలో భక్తులు పాల్గొనగా పురవీధుల్లో సాగింది. రథానికి పూల అంకరణ, రథానికి మైకులు, దివ్య రథోత్సవానికి చొప్పాలు వేసేందుకు దివ్వెల వెంకట శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు, కోసూరి సుబ్రహ్మణ్యం, సోదరులు, పెదరావూరు యూత్ సహకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు భాగవతుల శివసుబ్రహ్మణ్యం, కన్నెగంటి భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి వీవీ రమణకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ఆలయం వద్ద జరిగిన శివరాత్రి వేడుకల్లో భాగంగా రథోత్సవాన్ని జరిపారు.

సంగజాగర్లమూడిలో..

సంగజాగర్లమూడిలోని ప్రసిద్ధ శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రభలపై గ్రామోత్సవం జరిపారు. రాత్రి ఏడు గంటలకు దివ్యరథోత్సవాన్ని భక్తజనరంజకంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభలు మరో ఆకర్షణ. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంఎస్‌వీఎం రావు (సిద్ధార్థ బాబు) ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి వి.పద్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొలకలూరులోని శ్రీఅగస్త్యేశ్వరాలయంలోనూ మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకం, స్వామి కల్యాణం జరిపారు. గురువారం సాయంత్రం పెద్దసంఖ్యలో భక్తుల సమక్షంలో రథోత్సవాన్ని జరిపారు. ఈవో ఎ.నరసింహమూర్తి పర్యవేక్షించారు.



తెనాలిలో కిక్కిరిసిన భక్తుల మధ్య రామేశ్వరస్వామి రథోత్సవం



సంగంజాగర్లమూడి ఆలయంలో సంగమేశ్వరుడు



సంగమేశ్వర ఆలయంలో రథోత్సవ పూజలు



సంగమేశ్వర ఆలయంలో భక్తులు



సంగమేశ్వరుడి రథోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గుంటూరు రూరల్: మండలంలోని అడవితక్కెళ్లపాడులో గల అంబేడ్కర్ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్(సత్తెనపల్లి) ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ నిర్వహించారు. కార్యక్రమాన్ని మోన్‌టెక్స్ పెన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ సేల్స్ మేనేజర్ యూకే రాజు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ విజయ్‌భాస్కర్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కుగ్లర్ మెమోరియల్ ఫిజియోథెరపీ కాలేజీ (గుంటూరు) కస్పాండెంట్ కర్ర హానోక్ బెంజిమెన్ మాట్లాడుతూ విజయాలను సాధించిన ప్రతి ఒక్కరు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే సాధ్యమైందని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి మార్కులు సాధించాలని చెప్పారు. క్రమశిక్షణ, మంచి ఆలోచన విధానంతో ఇంటర్మీడియట్ దశను దాటిన వారే జీవితంలో మంచి భవిష్యత్తును అందుకోగలరని సూచించారు. స్కాలర్స్ ఆర్ ఆర్ బీ కోచింగ్ డైరెక్టర్ టి. ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, వ్యక్తిని సమర్థ ప్రగతిశీల వనరుగా తీర్చిదిద్దేది కేవలం చదువు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి, ఐఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.